

ప్రజావాణికి 54 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 54 ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిని పరిశీలిం చాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

- 8లో ▸



ఏడో రోజుకు సమ్మె

డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యో గులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఏడో రోజుకు కొనసాగింది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం 27.8/6.9

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసా గుతుంది.

న్యూస్‌రీల్

సబ్ జైలును సందర్శించిన జడ్జి



కామారెడ్డి క్రైం/కామారెడ్డి అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి టి.నాగరాణి సోమవారం పట్టణంలోని సబ్‌జైలును సందర్శించారు. ఖైదీల వివరాలు తెలుసుకున్నారు. సబ్ జైలు వంటగది, ఆహార సామగ్రిని పరిశీలించారు. సబ్‌జైలు పరిస్థితులను సూపరింటెండెంట్ సంజీవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తి వెంట డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మోహన్‌రావు, సిబ్బంది శ్రావణ్‌కుమార్, సాయిప్రణీత్ తదితరులున్నారు.

'రూ. 33.14 లక్షలు బాధితులకు అందించాం'

కామారెడ్డి క్రైం: సైబర్ నేరగాళ్ల నుంచి ఇప్పటివరకు రూ. 33.14 లక్షలు రికవరీ చేసి జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా బాధితులకు అప్పగించామని ఎస్పీ సింధు శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయేడాది జనవరిలో 1930 అనే నంబర్‌తో సైబర్ బాధితుల కోసం హెల్ప్‌లైన్ ప్రారంభమైందని పేర్కొన్నారు. సైబర్ మోసాలు జరిగినప్పుడు ఈ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత ఖాతాలను స్తంభింపజేయడం, ఇతర మార్గాల ద్వారా సొమ్ము రికవరీ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రికవరీ చేసిన మొత్తం కేసుల వివరాలను కోర్టుకు సమర్పించి లోక్‌అదాలత్ ద్వారా బాధితులకు అందిస్తున్నామని వివరించారు. శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 64 సైబర్ నేరాలకు సంబంధించి రూ.9,14,599 లను బాధితులకు అందజేశామని తెలిపారు. గత మూడు లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కలిపి 229 కేసులకు సంబంధించిన రూ. 33,14,895 లను బాధితులకు అందించామని పేర్కొన్నారు. సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

జిల్లా సంక్షేమాధికారిగా బాధ్యతల స్వీకరణ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూవో)గా ప్రమీల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీడీపీవోగా పనిచేసిన ప్రమీల పదోన్నతిపై కామారెడ్డి జిల్లా సంక్షేమాధికారిగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన బావయ్య కొన్నాళ్ల క్రితం బదిలీ అయిన విషయం తెలిసిందే. అప్పటినుంచి జిల్లా పరిషత్ సీఈవో చందర్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. డీడబ్ల్యూవోగా ప్రమీల బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్ష వాయిదా

కామారెడ్డి రూరల్: రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్ష ఈనెల 22వ తేదీకి వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ పరీక్ష బుధవారం జరగాల్సి ఉంది. రంగారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష జరగనుంది. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షకు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు, సంబంధిత గైడ్ టీచర్లు చూడాలని గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

రేపు జిల్లా స్థాయి అర్చరీ పోటీలు

దోమకొండ: సీఎం కప్ జిల్లా స్థాయి అర్చరీ పోటీలను బుధవారం దోమకొండలోని గడికోటలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు బుధవారం ఉదయం 8 గంటల వరకు 97051 41241 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా శబరిమాత ఉత్సవాలు



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



శబరి మాత చిత్రపటం, పాదుకలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన ఆశ్రమం


తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం రెండోరోజు శబరిమాత పాదుక పూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉదయం సుప్రభాతం, ధ్యానం, భగవద్గీత, గురుచరిత్ర పారాయణం చేశారు. అనంతరం అందంగా అలంకరించిన హంస వాహనంలో శబరిమాత పాదుకలు, చిత్రపటాన్ని ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులమీదుగా శోభాయాత్ర సాగింది. భక్తులు, కళాకారుల నృత్యాలు అలరించాయి. అనంతరం ఆశ్రమ సమీపంలోని ఊర గుట్టపై శబరి మాత పాదుకలను ఉంచి, పాదుకా పూజోత్సవం నిర్వహించారు. జిల్లావాసులే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, మెదక్, అదిలాబాద్, హైదరాబాద్ తదితర జిల్లాలు, పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలనుంచి భక్తులు భారీగా తరలి వచ్చి ఉత్సవాలలో పాల్గొన్నారు. భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాదుకా పూజోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేరు కాపురం..!

- విచ్ఛిన్నమవుతున్న ఉమ్మడి కుటుంబాలు
- ఏటా పెరుగుతున్న చిన్న కుటుంబాల సంఖ్య
- పదేళ్లలో 50 వేలకుపైగా పెరిగిన ఫ్యామిలీలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గతంలో కనీసం రెండు మూడు తరాల వారు కలిసే జీవించేవారు. ఒకరికొకరు తోడుగా నిలిచేవారు. ఉమ్మడిగా ఉన్నప్పుడు పిల్లలకు మంచి నడవడిక, పద్ధతులు, బాధ్యతలు తెలిసేవి. తప్పు చేయాలంటే భయం కనిపించేది. ఇదంతా గతం.. ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఎక్కడో ఒకటి అర కనపిస్తున్నాయి. చాలావరకు పెళ్లయ్యిందంటే చాలు వేరు కాపురాలు పెట్టేస్తున్నారు. బరువు, బాధ్యతలు తెలియడం లేదు. ఇదే సమయంలో వారికి పుట్టిన పిల్లలకు బంధాలు, అనుబంధాలు తెలియకుండాపోతున్నాయి. పండగలు, ఫంక్షన్ల సమయంలో కలుస్తున్నా వచ్చామా, వెళ్లామా అన్నట్లే ఉంటోంది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతుండడంతో బంధాలు దెబ్బతింటున్నాయి.

ఏటా 5 వేలకుపైనే కొత్త కుటుంబాలు..

2014లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జిల్లాలో 2,77,355 కుటుంబాలున్నాయి. ఎక్కడెక్కడో ఉన్న వారంతా సొంతూళ్లకు వచ్చి మరీ తమ కుటుంబాల వివరాలు రాయించుకున్నారు. అయితే రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల చేపట్టిన 'సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే'లో కుటుంబాల సంఖ్య 3,27,645గా తేలింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 2,62,384 కుటుంబాలు ఉండగా, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాల పరిధిలో 65,261 కుటుంబాలు ఉన్నాయి. అంతే జిల్లాలో పదేళ్ల క్రితం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో నమోదైన కుటుంబాల సంఖ్యకన్నా ఇప్పుడు 50 వేలకుపైగా కుటుంబాలు పెరిగాయి. సరాసరిగా ఏడాదిలో ఐదు వేల కుటుంబాలు వేరు కాపురం పెడుతున్నట్టు స్పష్టమవుతోంది.

ఎవరి దారి వారిదే..

ఉమ్మడి కుటుంబాలుగా ఉంటే తమకు స్వేచ్ఛ ఉండదనో.. డబ్బు సంపాదన ఉమ్మడి కుటుంబం లెక్కల్లో పోతుందనో.. ఇతర కారణాలతోనో చాలామంది పెళ్లయిన కొద్ది కాలానికే వేరు కాపురాలు పెట్టేస్తున్నారు. కొన్ని సామాజిక వర్గాల్లో అయితే పెళ్లి సంబంధాలు మాట్లాడుకునేటపుడే కాపురం ఎక్కడ పెడతారని అడుగుతుండడం గమనార్హం. ఉన్నత చదువులు చదివి ప్రైవేటు, కార్పొరేట్ ఉద్యోగాల వైపు వెళ్లిన వారిలో చాలామంది పెళ్లయిందంటే చాలు కన్నవారికి దూరంగా ఉంటున్నారు. తాము ఉంటున్న పట్టణాలు, నగరాల్లోనే కాపురం పెట్టేస్తున్నారు. సంపాదన కూడా తమది తమకే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఏం చేసేదిలేక కుటుంబ పెద్దలు ఎవరి బతుకు వారు బతకమని వదిలేస్తున్నారు. వెయ్యేళ్లున్నా వేరు తప్పదనే నానుడిని నిజం చేస్తూ ఆస్తులు, అప్పులు పంచుకుని ఎవరి దారిన వారు నడుస్తున్నారు.

బంధాలకు దూరమవుతున్న పిల్లలు..

వేరు కాపురాలతో చాలా కుటుంబాల్లో పిల్లలకు నానమ్మ, తాత, పెదనాన్న, చిన్నాన్న, పెద్దమ్మ, చిన్నమ్మ.. ఇలా రక్త సంబంధీకులు కూడా ఎవరో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. పిల్లలకు నానమ్మ, తాతయ్యలు చెప్పే నీతి కథలు నేటి తరం పిల్లలకు తెలియకుండాపోతున్నాయి. సంప్రదాయాలు, పద్ధతులు కూడా చెప్పేవారు లేరు. కొత్త తరాలు పెద్దవాళ్ల ప్రేమకూ నోచుకోలేకపోతున్నాయి. ఎవరితో ఎలాంటి బంధుత్వం ఉందో కూడా తెలియకుండా పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు భవిష్యత్తులో మరింత దయనీయంగా తయారయ్యే పరిస్థితి ఉంది.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

అసెంబ్లీలో కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ డిమాండ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేవీఆర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు అప్పుల్లో కూరుకుపోయారని, వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు చేసిన పనులకు సంబంధించి కామారెడ్డి నియోజకవర్గంలోనే రూ.7 కోట్లు రావాల్సి ఉందన్నారు. చాలా మంది పనులు చేసి అప్పుల పాలయ్యారన్నారు. ఏళ్ల తరబడిగా బిల్లులు రాకపోవడంతో అప్పులకు వడ్డీలు పెరిగిపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాటి సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు ఏ పార్టీకి చెందిన వారైనా వారు చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాల్సిందేనన్నారు.

వంతెన నిర్మించినా.. తీరని కష్టాలు



బ్రిడ్జి నిర్మించినా, రోడ్డు వేయకపోవడంతో తాత్కాలిక దారి మీదుగా వెళ్తున్న వాహనాలు

కామారెడ్డి పట్టణం నుంచి రామారెడ్డి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై గంగమ్మవాగు మీద వంతెన నిర్మించారు. ఇరువైపులా మట్టి నింపి రోడ్డు వేయకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో తాత్కాలిక రోడ్డు మీదుగానే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. వర్షాలు కురిసినపుడల్లా తాత్కాలిక వంతెన తెగిపోయి రోజుల తరబడి రాకపోకలు నిలిచి పోతున్నాయి. ప్రస్తుతం తాత్కాలిక రోడ్డు మీదుగా బస్సులు, ఇతర వాహనాలు వెళ్తున్నాయి. విపరీతంగా దుమ్ము లేస్తుండడంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్నవారు ఇబ్బందిపడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి పనులు పూర్తి చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

క్రీడలలో సత్తా చాటాలి



సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు క్రీడాపోటీలలో సత్తా చాటాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా స్థాయి పోటీలలో రాణించి రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో సీఎం కప్–2024 జిల్లా స్థాయి పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కప్ పోటీలు 16 ఈవెంట్లలో జరుగుతాయని, 323 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. మండలాల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీలలో 8 వేల మంది పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథం, ఆర్డీవో రంగనాథ్‌రావు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ వనిత పాల్గొన్నారు.

'గ్రూప్‌-2' ప్రశాంతం

48.3 శాతం హాజరు



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలకు సరాసరిన 48.3 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలో 8,085 మంది గ్రూప్–2 అభ్యర్థులకోసం కామారెడ్డి పట్టణంలో 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం నిర్వహించిన మొదటి పేపరుకు 3,971 మంది హాజరు కాగా.. మధ్యాహ్నం నిర్వహించిన రెండో పేపర్ 3,917 మంది రాశారు. సోమవారం ఉదయం నిర్వహించిన మూడో పేపర్ 3,859 మంది, మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో పేపర్ 3,871 రాశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్, నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. రీజనల్ సమన్వయకర్తలు కే.విజయ్‌కుమార్, వి.శంకరయ్య పరీక్షలను సమన్వయం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సమగ్ర సమ్మెతో సాగని బోధన

- సమ్మెలో కేజీబీవీ ఎస్‌వోలు, సీఆర్‌టీలు
- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్న ఉన్నతాధికారులు



ఎల్లారెడ్డి కేజీబీవీలో పాఠం బోధిస్తున్న ఎంఈవో వెంకటేశం (ఫైల్)

నాగిరెడ్డిపేట/బిచ్కుంద : డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బోధన కుంటుపడింది. దీంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.

ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు రిలే దీక్షలు చేశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో 10వ తేదీనుంచి నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మెలో కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్–టీచింగ్ సిబ్బంది కూడా పాల్గొంటున్నారు. ఫలితంగా కస్తూర్బాల్లో బోధనపై ప్రభావం పడింది. పదోతరగతి విద్యార్థులకు ఈనెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేయాల్సి ఉంది. కానీ జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఇప్పటివరకు 80 –85 శాతం సిలబస్ మాత్రమే పూర్తయ్యింది. మిగిలిన సిలబస్‌ను పూర్తి చేయించడంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతోపాటు ఇంటర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలతోపాటు వార్షిక పరీక్షల గడువు సమీపిస్తోంది. ఈ పరిస్థితుల్లో సిబ్బంది సమ్మెబాట పట్టడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

ప్రభుత్వ ఉపాధ్యాయులతో..

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె ప్రభావం కేజీబీవీలపై పడకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు ప్రారంభించారు. సమ్మెలో పాల్గొంటున్న పీజీ సీఆర్‌టీలు, సీఆర్‌టీల స్థానంలో సమీప ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో బోధన కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో నేరుగా ఎంఈవోలే కేజీబీవీలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. దీంతోపాటు ఇటీవల పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం సరఫరా అయిన ప్యానల్ బోర్డుల ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించాలని యోచిస్తున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీలతో..

జిల్లాలోని 19 కేజీబీవీలలో 195 మంది టీచింగ్(పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీలు), 245 మంది నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. ఇటీవల 32 మందిని గెస్ట్ ఫ్యాకల్టీగా తీసుకున్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో విద్యాబోధన కుంటుపడింది. గెస్ట్ ఫ్యాకల్టీ సిబ్బంది విధుల్లో కొనసాగుతుండడంతో వారు ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు బోధన జరుగుతోంది. వంతులవారీగా సగం మంది ఉద్యోగులు మాత్రమే సమ్మెలో పాల్గొంటున్నారని ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ ఒకరిద్దరు ఉద్యోగులు మాత్రమే పాఠశాలలో ఉంటూ మిగతా ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిసింది.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



సమగ్ర శిక్ష ఉద్యోగులకు క్రమబద్ధీకరిస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ నిలబెట్టుకోవాలి. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం బాధాకరం. మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించాలి. విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తాం.

– రాగిణి, ప్రత్యేకాధికారి, కేజీబీవీ, బిచ్కుంద

సగం మంది మాత్రమే సమ్మెలో..

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో జిల్లాలోని కేజీబీవీల నుంచి సగం మంది సిబ్బంది మాత్రమే పాల్గొంటున్నారు. సమ్మెలో పాల్గొనేవారి స్థానంలో ఇతర ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను పంపి విద్యార్థులకు పాఠాలు చెప్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎంఈవోలు ఉపాధ్యాయులను పంపుతున్నారు. పాఠాల బోధన కొనసాగుతోంది.

– సుకన్య, జీసీడీవో, కామారెడ్డి

ప్రజావాణికి 54 ఫిర్యాదులు

- వినతులు స్వీకరించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన ఇతర అధికారులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన 54 ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అంగన్‌వాడి భవనాలు, తదితర సమస్యలపై వినతులను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలని, మండల అధికారులు సూపర్ చెక్ చేయాలన్నారు. అవసరమైన లాగిన్‌లు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఇంటింటి సమగ్ర సర్వే ఆన్లైన్‌లో పొందుపర్చాలన్నారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, జెడ్పీ సీఈవో చందర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో దరఖాస్తులు నిల్



అదనపు కలెక్టర్‌కు వివరిస్తున్న తహసీల్దార్

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ మహేందర్ కుమార్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారని అన్నారు. ప్రజావాణికి సంబంధించిన వివరాలను అదనపు కలెక్టర్‌కు వీసీ ద్వారా సూచించామన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులున్నారు.

డెత్ సర్టిఫికెట్ ఇస్తలేరు



నవంబర్ నెలలో మా తల్లి చనిపోయారు. దీంతో పంచాయతీ సెక్రటరీకి డెత్ సర్టిఫికెట్ ఇవ్వాలని 20 రోజుల కిందట దరఖాస్తు చేసుకున్నాను. నాకు ఇప్పటి వరకు డెత్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. అధికారులు స్పందించి డెత్ సర్టిఫికెట్ ఇప్పించాలి.

– సల్మేడి ఆర్మీలయ్య, శ్రీ సిద్ధరామేశ్వరనగర్, భిక్కనూరు

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి



రాజంపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించినట్లు స్థానిక తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. రాజంపేటలో రెవెన్యూ సమస్యకు సంబంధించి ఒక దరఖాస్తు అందినట్లు ఆయన తెలిపారు. నాయబ్ తహసీల్దార్ సంతోషి, మండల గిర్దావర్ లక్ష్మయ్య, ఎంపీవో రఘురాం, ఎంఈవో పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీలకు చుక్కాపూర్ విద్యార్థి



ఎంపికైన విద్యార్థి శాలెమ్ రాజ్

మాచారెడ్డి: జావెలిన్ త్రో రాష్ట్ర స్థాయి పోటీలకు చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కోట శాలెమ్‌రాజ్ ఎంపికైనట్టు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రసూల్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో శాలెమ్ రాజ్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు వివరించారు. ఎంఈవో దేవేందర్‌రావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

సంఘాల డబ్బులు దుర్వినియోగం చేయలేదు

- ఆడిటింగ్‌లోనూ అదే తేలింది
- వీవోఏలు లక్ష్మీనర్సవ్వ, కృష్ణవేణి

కామారెడ్డి క్రైం: స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన డబ్బులు దుర్వినియోగం చేశారనే తప్పుడు నివేదికలతో తమను వీవోఏలుగా తొలగించారని, తామెవరి డబ్బులు వాడుకోలేదని రామారెడ్డి మండలం రెడ్డిపేటకు చెందిన తిప్పర్తి లక్ష్మీనర్సవ్వ, మద్దికుంట కృష్ణవేణిలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 24 ఏళ్లుగా తాము సంఘాల్లో పనిచేస్తున్నామని, వీవోఏలుగా సంఘాల అభివృద్ధికి కృషి చేశామే తప్ప, తామెవరి డబ్బులు దుర్వినియోగం చేయలేదన్నారు. ఈ నెల 10న రెడ్డిపేట గ్రామ సంఘంలో ఉన్న అన్ని సంఘాల లెక్కలు ఆడిటర్లు చూశారని, తమ సంఘాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని సంఘాల వాళ్లు కూడా స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఎలాంటి తప్పు చేయకున్నా తమపై తప్పుడు ఆరోపణలు చేసి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వారు జిల్లా అధికారులను కోరారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు జరిమానా

మాచారెడ్డి: నాటుసారా తయారు చేస్తూ గతంలో పట్టుబడిన లావుడ్యా లాలీ అనే మహిళను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా, బైండోవర్‌ను ఉల్లంఘించి మళ్లీ సారా తయారు చేయడంతో తహసీల్దార్ శ్వేత ఆమెకు రూ.10వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నాటుసారా తయారు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ స్పష్టం చేశారు.

మున్నూర్‌కాపులకు అవకాశాలు కల్పించాలి

- ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్
- బిచ్కుందలో మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం



ర్యాలీలో పాల్గొన్న ఆగ్రోస్ చైర్మన్ బాల్‌రాజ్, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు

బిచ్కుంద(జుక్కల్): మున్నూరుకాపులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారు.. ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించాలని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. సోమవారం బిచ్కుందలో పార్టీలకు అతీతంగా నియోజకవర్గ మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ కాసుల బాల్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి బండాయప్ప ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాసుల మాట్లాడుతూ.. విద్యా, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో మున్నూరుకాపులు వెనకబడి ఉన్నారన్నారు. వ్యవసాయమే జీవన ఆధారంగా జీవిస్తున్నారని అన్నారు. మున్నూరుకాపు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి యువకులకు రుణాలు ఇవ్వాలి.. రాజకీయాల్లో అవకాశం కల్పించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మామిళ్ల అంజయ్య, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఏడ్గి వినోద్, జయప్రదీప్, సొసైటీ చైర్మన్ బాలు, నాల్చర్ రాజు, సోపాన్, అరవింద్, బండి విజయ్ పాల్గొన్నారు.

బిచ్కుందకు తరలిన మున్నూరుకాపులు



నిజాంసాగర్(జుక్కల్): బిచ్కుంద మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మున్నురుకాపు సభకు నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల మున్నురుకాపు కులస్తులు భారీగా తరలి వెళ్లారు. రానున్న పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో మున్నూరుకాపులు ఐకమత్యంగా ఉండాలని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు.

భిక్కనూరుకు చేరుకున్న గోరక్ష మహాపాదయాత్ర



జంగంపల్లిలో స్వాగతం పలుకుతున్న ఆర్యసమాజ్ మందిరం ప్రతినిధులు

భిక్కనూరు: గోరక్ష మహాపాదయాత్ర సోమవారం భిక్కనూరు మండలానికి చేరుకుంది. మండల కేంద్రంతో పాటు జంగంపల్లి గ్రామంలో యాత్రకు ఘన స్వాగతం లభించింది. శ్రీ దత్త శరణానంద్ స్వామిజీ ఆశీస్సులతో హైదరాబాద్‌కు చెందిన బాలకృష్ణ మహాపాదయాత్ర నిర్వహిస్తున్నారు. ప్రజలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈ మహాపాదయాత్రను నిర్వహిస్తున్నామని గోరక్షకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేస్తూ ఈ మహాపాదయాత్రను చేపట్టినట్టు బాలకృష్ణ తెలిపారు. ఆర్ఎస్ఎస్, ఆర్యసమాజ్ ప్రతినిధులు, శ్రీరామదండు ప్రతినిధులు, అయ్యప్పస్వాములు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

నాగిరెడ్డిపేట : పోచారం ప్రాజెక్టు వద్దకు ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన యువకుడిని పోలీసులు కాపాడారు. హైదరాబాద్‌లోని సుచిత్ర ప్రాంతానికి చెందిన అనపోజు వినయ్ (28) కుటుంబ సభ్యులతో గొడవపడి సోమవారం పోచారం ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. ప్రాజెక్టు కట్టపై నిలబడి కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి తానున్న లొకేషన్‌ను ఫోన్ ద్వారా పంపాడు. దీంతో వినయ్ కుటుంబ సభ్యులు అప్రమత్తమై 100 డయల్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు.నాగిరెడ్డిపేట పోలీసులు వెంటనే ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజె క్టు కట్టపై నిలబడి ఉన్న వినయ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడిని కాపాడిన కానిస్టేబుల్ చంద్రయ్య, హోంగార్డు కాశయ్యను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

174 సైబర్ క్రైం కేసుల పరిష్కారం

- లోక్ అదాలత్‌లో జిల్లా పోలీసుశాఖకు రాష్ట్రంలో ఐదో స్థానం
- ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ వెల్లడి



సింధుశర్మ

ఖలీల్‌వాడి: జాతీయ లోక్ అదాలత్ ద్వారా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో నమోదైన 174 కేసులను పరిష్కరించినట్లు ఇన్‌చార్జి సింధు శర్మ సోమవారం తెలిపారు. మొత్తం 174 కేసుల్లో రూ.71,52,505 నగదును బాధితులకు ఇప్పించామన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా సైబర్ క్రైమ్ పరిధిలోని కేసుల పరిష్కారంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో హోల్డ్‌లో ఉన్న డబ్బులను, జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఫిర్యాదుదారులకు ఇప్పించేందుకు ఉత్తర్వులను జారీ చేశామన్నారు. రూ.25 వేల కన్నా ఎక్కువ నష్టపోయిన 131 కేసుల్లో రూ.6,70,022 అలాగే 25 వేల కన్నా తక్కువ నష్టపోయిన 43 కేసుల్లో రూ.4,52,284 నగదు ఉందన్నారు. సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని, కస్టమర్ కేర్ నంబర్లను గుగూల్ లో వెతకొద్దని, ఆయా సంస్థల అధికారిక వెబ్‌సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నంబర్లను పొందాలన్నారు. అపరిచిత నంబర్ల నుంచి ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించొద్దన్నారు. సైబర్ నేరగాళ్లబారిన పడిన వారు వెంటనే 1930కు సమాచారం అందించాలని సూచించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వ్యవసాయభూమి సాగు విషయంలో భర్తతో గొడవపడి భార్య, కడుపు నొప్పి భరించలేక వృద్ధురాలు, భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు, మద్యం మత్తులో మరో యువకుడు ఆత్మహత్య చేసుకోగా, అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి గోదావరిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

భూమి విషయంలో భర్తతో గొడవపడి..

మోపాల్(నిజామాబాద్‌రూరల్):వ్యవసాయ భూమి సాగు విషయంలో భర్తతో గొడవ పడి మండలంలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన పోసాని (55) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన పోసాని తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారన్నారు. అదేరోజు సాయంత్రం చేపల వేటకు వెళ్లిన జాలర్లకు చెరువులో పోసాని మృతదేహం కనిపించిందని తెలిపారు. మృతురాలి కుమార్తె పల్లికొండ స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక..

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని రాంపూర్‌గడ్డ తండాకు చెందిన సంపంగి పోశయ్య(60) కడుపు నొప్పి భరించ లేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు సోమవారం తెలిపారు. గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్న పోశయ్య ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లైన్‌గల్లీకి చెందిన షేక్ ఇమ్రాన్ (30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మద్యానికి బానిసైన ఇమ్రాన్ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగేవాడు. మద్యం తాగేందుకు డబ్బులు సరిపోక ఇంట్లో గొడవలు చేసి గత రెండు రోజుల క్రితం భార్యను మాలపల్లి లోని పుట్టింటికి పంపించేశాడు. ఒంటరిగి ఉన్న ఇమ్రాన్ మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి..

నవీపేట: మండలంలోని యంచ గోదావరిలో దూకి నిజామాబాద్‌లోని పాటిగల్లీకి చెందిన మాడుగుల సుధాకర్(42) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. ఖానాపూర్ రైస్ మిల్లులో కూలీగా పని చేసే సుధాకర్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తి చెందిన సుధాకర్ ఆదివారం గోదావరిలో దూకి గల్లంతయ్యాడన్నారు. సోమవారం మృతదేహం లభించిందని ఎస్సై తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..

దోమకొండ: భార్య కాపురానికి రావడంలేదని మండల కేంద్రానికి చెందిన బొయిని రాకేశ్(26) అనే యువకుడు ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రాకేశ్‌కు ఆరు నెలల క్రితం వివాహం కాగా, నాటి నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన రాకేశ్ ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వ్యవసాయబావి వద్ద రాకేశ్ చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో అతడి స్నేహితుడు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయానికి తాళం

- రెండేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో తాళం వేసిన యజమాని



మోపాల్ ఎంపీడీవో కార్యాలయం..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయానికి (ఎంపీడీవో) భవన యజమాని గంగుబాయి సోమవారం తాళం వేశారు. రెండేళ్లుగా కార్యాలయ అద్దె చెల్లించకపోవడంతో తాళం వేసినట్లు తెలిసింది. అతి త్వరలోనే అద్దె చెల్లిస్తామనే అధికారుల హామీతో తాళం తీసి కార్యాలయం తెరిచారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు, కార్యాలయ అధికారులు, సిబ్బంది రెండు గంటలపాటు బయట కూర్చోవాల్సి వచ్చింది.

రెండేళ్ల అద్దె చెల్లించాల్సి ఉంది

ఎంపీడీవో కార్యాలయం సుమారు ఆరేళ్ల క్రితం ప్రారంభంకాగా,పక్కా భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇలా ఎంపీడీవో కార్యాలయంతోపాటు ఎంపీవో, ఉపాధిహామీ కార్యాలయాలు అదే భవనంలో కొనసాగుతున్నాయి. ప్రతినెలా రూ.12వేలు అద్దె చెల్లించాల్సి ఉండగా, రెండేళ్లుగా అద్దె చెల్లించడం లేదు. ఐదారు నెలలుగా అద్దె చెల్లించాలని కోరుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని యజమాని తెలిపారు.

మున్నూరుకాపులకు అవకాశాలు కల్పించాలి



బిచ్కుంద(జుక్కల్): అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న మున్నూరుకాపులకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. సోమవారం బిచ్కుందలో పార్టీలకు అతీతంగా నియోజకవర్గ మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బాల్‌రాజ్‌తోపాటు జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి బండాయప్ప ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాసుల మాట్లాడుతూ.. మున్నూరుకాపులు వ్యవసాయమే జీవనాధారం జీవిస్తున్నారని అన్నారు. మున్నూరుకాపు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి యువకులకు రుణాలు ఇవ్వాలి.. రాజకీయాల్లో అవకాశం కల్పించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై యాదగిరిగౌడ్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ శివారులో బైక్ అదుపుతప్పి దూస్‌గాం గ్రామానికి చెందిన ఇందూర్ రాములు (47) మృతి చెందాడు. సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయం చేసుకుంటూ జీవితంచే రాములు వ్యక్తిగత పని నిమిత్తం ఉదయం జిల్లా కేంద్రానికి వచ్చి మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో దూస్‌గాంకు తిరుగు ప్రయాణమయ్యాడు. కంజర్ – కులాస్‌పూర్ గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడిపోగా, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సువర్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యభిచారం గృహంపై సీసీఎస్ పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగర శివారులోని పాంగ్రా ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం కొనసాగుతోందనే సీఐ అంజయ్య సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారన్నారు. ముగ్గురు మహిళలతోపాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

గోదాంలో చోరీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని ఫరూక్ అనే వ్యక్తికి చెందిన ఎలక్ట్రిసిటీ సామగ్రి గోదాములో చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. దుండగులు గోదాం తలుపులను పగులగొట్టి రూ.50వేల విలువ చేసే వస్తువులను ఎత్తుకెళ్లారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత..

బాల్కొండ: మినీ గూడ్స్ వాహనంలో తరలిస్తున్న 37.2 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ రిజ్వాన్‌ఖాన్, అబ్దుల్ ఖలీల్ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో మేరకు వాహనాన్ని వెంబడించి పాతబస్టాండ్ ప్రాంతంలో పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామానికి బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్ సోమవారం తెలిపారు. ఆదివారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన బాలిక తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారని ఆచూకీ లభించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. బాలిక ప్రస్తుతం రెంజల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోందని తెలిపారు. బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆకతాయిలకు రెండు రోజుల జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఈవిటీజింగ్‌కు పాల్పడిన ఇద్దరు ఆకతాయిలకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి తీర్పు ఇచ్చినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో షీటీం పోలీసులు ఇద్దరు ఆకతాయిలను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారన్నారు. యువకులను సోమవారం బోధన్ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్షను విధించారని తెలిపారు.

కమ్యూనిటీ సర్వీస్ చేయాలని న్యాయమూర్తి తీర్పు

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులకు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని సెకండ్ క్లాస్ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు సీఐ తెలిపారు. పట్టణంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా కమ్యూనిటీ సర్వీస్ చేయాలని తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: కోటగిరి మండలం రాంపూర్‌లో ఆదివారం రాత్రి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు.

మాయమాటలు చెప్పి నగదు అపహరణ



సీసీ ఫుటేజీలో నిందితుడు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో వృద్ధుడికి ఓ వ్యక్తి మాయమాటలు నగదును అపహరించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బాద్గుణ గ్రామానికి చెందిన తన్నూరి నాగన్న అనే వృద్ధుడు యూనియన్ బ్యాంకుకు వచ్చి తన ఖాతా నుంచి రూ.26 వేలు డ్రా చేసుకునేందుకు సిబ్బందితో చెక్కు రాయించుకుని కౌంటర్‌లో ఇచ్చారు. బ్యాంకు అధికారులు పిలుస్తారని వేచి చూస్తున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి నాగన్నతో మాటలు కలిపాడు. తనకు క్యాషియర్ తెలుసునని, డబ్బులు త్వరగా డ్రా చేసి ఇస్తానని నీవు కూర్చోమని నమ్మబలికాడు. బ్యాంకు అధికారి నాగన్న పేరు పిలవగానే సదరు వ్యక్తి వెళ్లి దూరంగా కూర్చున్న నాగన్న చూపించి డబ్బులు తీసుకున్నాడు. ఈ విషయం తెలియని నాగన్న వద్దకు వెళ్లిన వ్యక్తి క్యాషియర్‌కు చెప్పానని వెళ్లి డబ్బులు తీసుకోవాలని సూచించి తనకు ఫోన్ వచ్చిందని ఉడాయించాడు. నాగన్న క్యాష్‌కౌంటర్ వద్దకు వెళ్లి డబ్బులు అడుగగా ఇదివరకే నీవు చెప్పిన వ్యక్తికి ఇచ్చామని చెప్పడంతో నాగన్న మోసపోయానని తెలిసి లబోదిబోమన్నాడు.

గంటన్నర సేపు బ్యాంకులోనే మకాం

నగదుతో ఉడాయించిన వ్యక్తి మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు వరకు బ్యాంకులోనే తిష్ట వేసి అవకాశం కోసం వేచి చూశాడు. బ్యాంకులోకి వచ్చిన వారితో మాటలు కలుపుతూ చోరీ చేసేందుకు ప్రయత్నించాడు. చివరికి బాద్గుణ గ్రామానికి చెందిన తన్నూరి నాగన్న అనే వృద్ధుడిని నమ్మబలికి రూ.26 వేలతో ఉడాయించాడు. ఈ విషయమై బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి గాలిస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

11 తులాల బంగారం అపహరణ

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముబారక్‌నగర్ ప్రాంతంలోని ఏకశిలనగర్‌లో నివాసం ఉంటున్న రవి, మహేశ్ అనే వ్యక్తుల ఇళ్లలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడి 11 తులాల బంగారం, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రవి, మహేశ్ ఈనెల 13న వారి స్వగ్రామమైన మాక్లూర్ మండల కేంద్రానికి శుభకార్యం నిమిత్తం తమ ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. దుండగులు 14వ తేదీన అర్ధరాత్రి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం వచ్చిన రవి, మహేశ్ తమ ఇళ్లలో చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ముబారక్‌నగర్‌లో గత పదిరోజుల క్రితం ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడిన ఘటనను మరువకముందే రెండు ఇళ్లలో చోరీ జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.